సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.50 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 8.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.75,710
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,781
3శాతం జీఎస్టీతో	రూ.6,984
సవర (8గ్రాములు)	రూ.55,872



అదుపుతప్పిన ఆటో

ఆటో అదుపుతప్పిన ఘటన గుడ్లూరు – తెట్టు ప్రధాన రహదారిలోని రాళ్లవాగు సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదంలో 13 మంది మహిళా కూలీలు గాయపడ్డారు. 8లో



జనసంద్రమైన కావలి



ఆర్వోకు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి



జేజేలు పలుకుతున్న శ్రేణులు

నామినేషన్ల షురూ..

ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఆర్వోలకు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. మరోవైపు తమ అభిమాన నేతలు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో ఆయా పార్టీల నేతలు, మద్దతుదారులు సందడి చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

విజయీభవ..

కావలి: అశేష జనవాహిని వెంటరాగా.. కావలి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తన నామినేషన్‌ను గురువారం దాఖలు చేశారు. తొలుత తన ఇంటి నుంచి ఉదయం ఎనిమిది గంటలకు బయల్దేరారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి సోదరి సోమేశ్వరమ్మ కుమార్తె సంహిత విజయతిలకం దిద్దగా, కుటుంబసభ్యులతో కలిసి కావలి గ్రామదేవత కలుగోళమ్మ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్న అనంతరం అభిమానులతో కలిసి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని ఆర్వో శీనానాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. తొలుత చర్చి, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ కందుకూరు పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు సిద్ధిరస్తు..

కోవూరు: కోవూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన నామినేషన్ పత్రాన్ని పార్టీ నేతల సమక్షంలో ఆర్వో సేతు మాధవన్‌కు గురువారం అందజేశారు. తొలుత కోవూరు తహసీల్దార్ కార్యాలయానికి తన కుటుంబసభ్యులతో కలిసి చేరుకున్నారు. అనంతరం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రసన్న తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి సైతం ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అభినందనలను తెలియజేశారు. ఈదఫా విజయం మీదేనని పలువురు ఆశీర్వదించారు. ఈ ఎన్నికల్లో 175 అసెంబ్లీ.. 25 పార్లమెంట్ స్థానాలను పార్టీ దక్కించుకోవడం ఖాయమని ప్రసన్న చెప్పారు. ఎమ్మెల్యే తల్లి నల్లపరెడ్డి లక్ష్మమ్మ, సతీమణి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి, సోదరుడు నల్లపరెడ్డి రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ఇలా..

నియోజకవర్గం	దాఖలైనవి
నెల్లూరు లోక్‌సభ	01
కోవూరు	06
కావలి	05
ఆత్మకూరు	01
నెల్లూరు రూరల్	01
ఉదయగిరి	01
కందుకూరు	--
నెల్లూరు సిటీ	--
సర్వేపల్లి	--

న్యూస్‌రీల్

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



నెల్లూరు(క్రైమ్): అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయాధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని ధనలక్ష్మీపురంలోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో గురువారం నిర్వహించారు. ప్రమాద సమయాల్లో తమను తాము రక్షించుకుంటూ ఇతరులను ఎలా కాపాడాలనే అంశాన్ని డెమో ద్వారా వివరించారు.

నిబంధనలకు తిలోదకాలు

- ప్రచారంలో పాల్గొన్న వీఓఏ



అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీదకొండూరుకు చెందిన పొదుపు గ్రూపుల స్వయం సహాయక సభ్యురాలు (వీఓఏ) ఎన్నికల నిబంధనలకు తూట్లు పొడిచారు. గ్రామంలో టీడీపీ ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వీఓఏ వీరమాచినేని మాధవి పాల్గొన్నారు. ఆనం వెంటే ప్రచారంలో ఉండి టీడీపీ అభ్యర్థికి ఓటేయాలని ప్రజలను కోరారు. ఈమెపై తక్షణమే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాకు చేరుకున్న పరిశీలకులు



కలెక్టర్‌ను కలిసిన పరిశీలకులు

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన జ్యోతిమోయ్‌బైలాంగ్, కంచన్‌రామ్ మీనా జిల్లాకు గురువారం చేరుకున్నారు. ఈ క్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు జ్యోతిమోయ్‌బైలాంగ్.. కోవూరు, నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి నియోజకవర్గాలకు పరిశీలకులుగా కంచన్‌రామ్ మీనా వ్యవహరించనున్నారు.

పింఛనర్ల సర్వసభ్య సమావేశం వాయిదా

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23కు వాయిదా వేశామని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వెంకయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహించాల్సి ఉందని, అయితే అనివార్య కారణాలతో వాయిదా వేశామని చెప్పారు. ఈ మార్పును సభ్యులు గమనించి పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రారంభమైన ఎన్నికల సందడి

- తొలి రోజు 15 సెట్ల నామినేషన్లు దాఖలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో జిల్లాలో సందడి నెలకొంది. గురువారం మంచి రోజు కావడంతో 15 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గానూ కందుకూరు, నెల్లూరు సిటీ, సర్వేపల్లిలో నామినేషన్లు నమోదు కాలేదు. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు నామినేషన్లు దాఖలు చేశారు. నెల్లూరు పార్లమెంట్‌కు ఓ నామినేషన్ నమోదైంది.

నామినేషన్లు ఇలా..

- కోవూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు డమ్మీ అభ్యర్థిగా ఆయన తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి రెండు సెట్ల చొప్పున నామినేషన్లు వేశారు.
- కావలి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు డమ్మీగా ఆయన సతీమణి ఆదిలక్ష్మమ్మ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.



కోవూరు ఆర్వో కార్యాలయం వద్ద బందోబస్తు

- కోవూరు టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో నామినేషన్ దాఖలు చేయించారు.
- నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఆర్పీఐ తరపున మహబూబ్‌బాషా నామినేషన్ వేశారు.

24న తుది ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న హరినారాయణన్

- ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను ఈ నెల 24లోపు పరిష్కరించి, తుది జాబితాను అదే రోజున విడుదల చేయనున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ వెల్లడించారు. కలెక్టరేట్లోని ఎస్సార్ శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 20,53,397 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని తెలిపారు. నామినేషన్ల దాఖలు గడువు ఈ నెల 25తో ముగియనుందని, 26న స్క్రూటినీని నిర్వహించనున్నామని చెప్పారు. 27, 28 సెలవు దినాలు కావడంతో నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదే గడువు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు గుర్తులను అదే రోజు మధ్యాహ్నం 3.15కు కేటాయించనున్నామన్నారు. నామినేషన్ల ప్రారంభం నుంచి ఖర్చులు లెక్కల్లోకి వస్తాయని తెలిపారు. సాధారణ, పోలీస్ పరిశీలకులు త్వరలో జిల్లాకు రానున్నారని వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్లను ఫెసిలిటేషన్ సెంటర్‌లో వేయాలని.. సీఆర్పీఎఫ్, ఆర్మీ తదితర సర్వీస్ ఓటర్లు మాత్రమే పోస్టులో పంపాలని పేర్కొన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నారాయణ, టీడీపీ నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రసూల్, బీజేపీ తరఫున శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, సీపీఐ తరఫున అజయ్‌కుమార్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు అభివృద్ధే ధ్యేయం



ఎన్నికల ప్రచారంలో విజయసాయిరెడ్డి

- నగరానికి నారాయణ చేసిందేమీ లేదు
- ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 53, 54వ డివిజన్లలో ఇంటింటి ప్రచారాన్ని పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న నారాయణ నెల్లూరు నగరాభివృద్ధికి రూ.5200 కోట్లు వెచ్చించామని చెప్తున్నారని, ఇదే నిజమైతే నగరం ఇలా ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. మంత్రిగా ఆయన చేసిందేమీలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే 54వ డివిజన్లోని ఇస్లాంపేట, జనార్దన్‌రెడ్డికాలనీ, వెంకటేశ్వరపురంలో డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ డివిజన్లోనే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.80.45 కోట్ల లబ్ధి చేకూర్చామన్నారు. జనార్దన్‌రెడ్డికాలనీలో షాదీమంజిల్ నిర్మాణాన్ని చేపడతామని హామీ ఇచ్చారు. హిందూ శ్మశాన వాటిక ఏర్పాటుతో పాటు వెంకటేశ్వరపురం నుంచి జనార్దన్‌రెడ్డికాలనీకి వెళ్లే మెయిన్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన 36 కుటుంబాలకు పట్టాలను అందజేస్తామని చెప్పారు.

రవాణా సౌకర్యాన్ని కల్పిస్తాం

టిడ్కో గృహ సముదాయం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసి రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని వెల్లడించారు. వెంకటేశ్వరపురం నుంచి గాంధీగిరిజనకాలనీకి అండర్ బ్రిడ్జిని నిర్మిస్తామని చెప్పారు. అనంతరం జనార్దన్‌రెడ్డికాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ నేత ఖాదర్‌బాషాను పరామర్శించారు. కార్పొరేటర్ సఫియా బేగం, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆనం విజయకుమార్‌రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల రాద్ధాంతం

- కోవూరులో ఉద్రిక్తత

కోవూరు: నామినేషన్ల సందర్భంగా కోవూరు తాలూకా కార్యాలయ ప్రాంగణం వద్ద గురువారం ఉదయం కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తమ అనుచరులతో కలిసి నామినేషన్ వేసేందుకు అక్కడికి చేరుకున్నారు. ప్రశాంతిరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నెల్లూరు సిటీ, రూరల్ అభ్యర్థులు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు హాజరయ్యారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్వో కార్యాలయంలోకి గుంపుగా వెళ్తున్న వీరిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కూటమి నేతలు, కార్యకర్తలు కేకలేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. శాంతిభద్రతలు చేయిదాటిపోతున్నాయని భావించిన పోలీసులు వారిని చెదరగొట్టారు.



అప్రమత్తంగా విధులు నిర్వర్తించండి

నెల్లూరు(క్రైమ్): నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్, కార్పొరేషన్, నెల్లూరు ఆర్డీఓ కార్యాలయాల్లోని నామినేషన్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలోనే అభ్యర్థుల ఊరేగింపులను నిలిపేయాలని సూచించారు. అభ్యర్థితో పాటు నలుగుర్ని మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. చిన్నబజార్, నవాబుపేట, డీటీసీ ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, బాబీ, సుబ్బారావు, ఎస్సైలు సైదులు, సుధీర్, లతీఫున్నీసా, తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న నగర డీఎస్పీ

గురుకులాల్లో 25 నుంచి ప్రవేశ పరీక్షలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పరీక్షలను ఈ నెల 25న నిర్వహించనున్నామని ఏపీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో చేరే 5, 6, 7, 8వ తరగతుల విద్యార్థులకు ఉదయం పది నుంచి 12 వరకు.. కళాశాలల్లో ప్రవేశం కోరే వారికి పరీక్షను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు వరకు నిర్వహించనున్నామని చెప్పారు. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

పక్కాగా నియమావళి అమలు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన నాటి నుంచి ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నామని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. నగదు, మద్యం అక్రమ రవాణా కట్టడికి 18 చెక్‌పోస్టులను జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.78 కోట్లను సీజ్ చేశామన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి విస్తృత తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా పర్యటించారు. బుజబుజనెల్లూరు, చిల్డ్రన్స్‌పార్కు, ఇరుకళల పరమేశ్వరి దేవస్థాన సమీపంలోని చెక్‌పోస్టులతో పాటు బీవీ నగర్‌లో నైట్‌బీట్లను తనిఖీ చేశారు. వాహన తనిఖీలను స్వయంగా నిర్వహించారు. మద్యం, నగదు అక్రమ రవాణా కట్టడి, నేర నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టుల్లోని సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కోరారు. నైట్ బీట్ సిబ్బంది లాఠీని కలిగి ఉండటంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వేలిముద్రలను పరిశీలించడంతో పాటు చిరునామా, ఫోన్ నంబర్లను బీట్ బుక్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. మందుబాబులు, ఆకతాయిలపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

తనిఖీలను ముమ్మరం చేయాలి

జిల్లా వ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేయాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్‌ఈబీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నాటుసారా, గంజాయి, మద్యం అక్రమ నిల్వలు, రవాణాను గుర్తించి ఆకస్మిక దాడులను నిర్వహించి సీజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోకి పొరుగు మద్యం రాకుండా చెక్‌పోస్టుల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయడంతో పాటు సరిహద్దు స్టేషన్లలో గట్టి నిఘాను ఉంచాలన్నారు. మద్యం స్టాక్ పాయింట్లు, బార్లలో నిరంతర తనిఖీలు చేపట్టి, అక్రమాలను గుర్తిస్తే తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, డంప్‌లను గుర్తించి ఫ్లయింగ్ స్క్వాడ్లతో కలిసి దాడులు జరపాలని చెప్పారు. ఏఎస్పీ సౌజన్య, ఎస్‌ఈబీ ఈఎస్ బాబుశ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

వెంకటాచలం: 'చంద్రబాబు నాయుడికి ఇవే చివరి ఎన్నికలు. అందువల్లే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి ఓర్వలేక రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కురిచెర్లపాడు, ఇస్లాంపేట గ్రామాల్లో గురువారం సాయంత్రం కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌పై జరిగిన దాడికి సంబంధించి పోలీసుల విచారణలో కుట్ర కోణం వెలుగు చూసిందన్నారు. హత్య చేయాలనే ఆలోచనతోనే దాడి చేశానని నిందితుడు అంగీకరించడంతో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. ఈ దాడి వెనుక చంద్రబాబు, అతని కుమారుడు లోకేశ్ హస్తం ఉందనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ లోతైన దర్యాప్తు జరిపించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులు చేయాలని ప్రేరేపించడంతోనే జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగిందనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. బాబు ఎన్ని కుట్రలు చేసినా, దాడులు చేయించినా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండడంతో వైఎస్ జగన్ సురక్షితంగా రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లో తిరుగుతున్నారని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఎంపీటీసీ ప్రభావతి, సర్పంచ్ అక్బర్‌బాషా, నాయకులు కొణిదెన విజయభాస్కర్ నాయుడు, వెంకటరమణయ్య, కామాక్షయ్య తదితరులు పాల్గొన్నారు.

నేను చేసిన అభివృద్ధిని చూడండి



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

• ప్రజలను కోరిన వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల

నెల్లూరు సిటీ: 'రూరల్ నియోజకవర్గంలో గతేడాది కాలంలో నేను చేసిన అభివృద్ధిని చూడండి. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించాక అనేక పనులు చేయించాను. వీటిని చూసి నాకు ఓటు వేయాలి' అని వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. కొత్తవెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో గురువారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజలు ఆదాలకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలన, రూరల్ నియోజకవర్గంలో తాను చేసిన పనులను చర్చించుకుని ఆశీర్వదించాలని కోరారు. సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవ చేయడమే లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు తనపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవన్నారు. ప్రజా సేవలోనే నిత్యం కొనసాగుతున్నానని తెలిపారు. ఏడాది కాలంలో కొత్తవెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో అనేక పనులు చేశామన్నారు. అసంపూర్తిగా ఉన్న వాటిని ఎన్నికల అనంతరం పూర్తిస్థాయిలో చేయిస్తానన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ఎన్నికల హామీలు నెరవేర్చలేదన్నారు. జగన్ ప్రతి హామీని నెరవేర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, బూడిద విజయ్‌కుమార్‌యాదవ్, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, పుచ్చలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, కొత్త వెల్లంటి గ్రామ సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యుడు దేవసేన, కొత్తవెల్లంటి నాయకుడు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే నన్ను గెలిపిస్తాయ్



నామినేషన్ అనంతరం బయటకు వస్తున్న ప్రసన్న, నాయకులు

• కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే తనను కోవూరు ఎమ్మెల్యేగా మరోసారి గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు అసెంబ్లీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి గురించి ప్రజలందరూ తెలుసుకోవాలన్నారు. డబ్బు ఉందని, ఏదైనా తమ వద్దకు వస్తుందని వాళ్లు భావిస్తున్నారన్నారు. వారికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఎన్ని కుట్రలు పన్నినా జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.60
పండ్లు : రూ.26

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 144
లేయర్ (లైవ్) : 98
బ్రాయిలర్ చికెన్ : 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 284
లేయర్ చికెన్ : 167

క్లుప్తంగా

శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు

• 69 కర్ణాటక మద్యం బాటిళ్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, ఎస్సైలు

నెల్లూరు(క్రైమ్): బెంగళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 69 ఫుల్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ సీహెచ్ విజయభాస్కర్ గురువారం నగరంలోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంతకల్ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు రైళ్లలో తనిఖీలు చేస్తున్నారు. వెండి ఆభరణాలు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. అందులో భాగంగా బుధవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది గణేష్, ప్రసాద్ బెంగళూరు నుంచి కాకినాడకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టారు. నెల్లూరుకు సమీపిస్తుండగా ఎస్4 కోచ్‌లో 63 బెర్త్ కింద ఐరన్‌బాక్స్ అనుమానాస్పదంగా ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. అది ఎవరిదనే విషయాన్ని ఆరా తీయగా కోచ్‌లోని వారు తమకు తెలియదని చెప్పడంతో నెల్లూరులో దించారు. అందులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 69 ఫుల్ బాటిళ్ల మద్యంను గుర్తించారు. రైల్వే ఎస్సై మాలకొండయ్య కేసు నమోదు చేశారు. ఎన్నికలు ముగిసే వరకు తనిఖీలు కొనసాగిస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రైల్వే ఎస్సై ఎస్.హరిచందన, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న రామిరెడ్డి, చిత్రంలో మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి

• కావలి అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ కావలి అసెంబ్లీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కావలి ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నామినేషన్ సందర్భంగా ఆశీస్సులు అందించేందుకు తరలివచ్చిన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు పూర్తయి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేసే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లు పూర్తయ్యాయన్నారు. వాటికి అనుబంధ పరిశ్రమల ద్వారా భారీగా ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయన్నారు. దీంతో పట్టణం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. తనపై నమ్మకంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. మూడోసారి 30 వేలకు పైగా మెజారిటీతో ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

మిర్చి కోతలకు వెళ్తూ..



ప్రమాదంలో గాయపడిన మహిళలు

• ఆటో బోల్తా.. 13 మంది మహిళా కూలీలకు గాయాలు • ఇద్దరి పరిస్థితి విషమం

గుడ్లూరు: ఆటో అదుపుతప్పి బోల్తా పడి 13 మంది మహిళా కూలీలు తీవ్రంగా గాయపడిన ఘటన గుడ్లూరు – తెట్టు ప్రధాన రహదారిలోని రాళ్లవాగు సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావలి రూరల్ మండలం వెంకటేశ్వరపాళెం గ్రామానికి చెందిన 13 మంది మహిళా కూలీలు కందుకూరు రూరల్ మండలంలోని గోపాలపురంలో మిర్చి కోతలకు ఆటోలో బయలుదేరారు. వాహనం పొట్లూరు దాటి రాళ్లవాగు సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కన తిరగబడి చెట్టును ఢీకొంది. దీంతో మహిళలంతా చెల్లాచెదురుగా పడిపోయారు. ముగ్గురు ఆటోలో ఇరుక్కుపోయారు. కావలి నుంచి కందుకూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని గమనించారు. అతను, కొందరు ప్రయాణికులు దిగి మహిళలను బయటకు తీసి గుడ్లూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన కుమారి, రాములమ్మ, వెంకటరమణమ్మ, జాలమ్మ, జయలక్ష్మి, మంగమ్మ, గోవిందమ్మ, సుబ్బరత్తమ్మ, జయమ్మ, వనమ్మ, రమణమ్మ, పొట్టెమ్మ, సుబ్బమ్మను నాలుగు 108 అంబులెన్స్‌లలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వారిలో పొట్టెమ్మ, సుబ్బమ్మల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

• పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
• ఎస్పీ ఆరిఫ్ హఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

ఫిర్యాదు చేయాల్సిన ఫోన్ నంబర్లు
94407 96385, 93929 03413, 0861 - 2328400

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. నెల్లూరులోని పోలీస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లోని తొమ్మిది వేల మందిని ముందస్తు బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు ముగిసే వరకూ వారి కదలికలపై నిఘా ఉంటుందన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణా, అనధికార విక్రయాలు, నిల్వలు, పంపిణీని పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 18 చెక్ పోస్టులు, 26 ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్నికలకు ప్రత్యేక పోలీసు అధికారిని నియమించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో స్థానిక పెద్దల సహకారంతో ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కేంద్రంలో పోలీసు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగినా, ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుగుతున్నా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. నేరుగా ఫోన్ చేసినా, ఫొటోలు పంపినా తక్షణమే చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ప్రశాంత ఎన్నికలకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజాశీస్సులు

ప్రచార పర్వం

ఎన్నికల ప్రచారంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులకు ప్రజల నుంచి ఆశీస్సులు లభిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి గురువారం నెల్లూరు 53, 54వ డివిజన్లకు వెళ్లారు. అక్కడి జనం ఆయనతో ఆప్యాయంగా మాట్లాడారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలంటూ ఆయన కుమార్తె హిమబిందు బుజబుజనెల్లూరులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు బొట్టు పెట్టి ఆహ్వానించి ఆశీస్సులు అందజేశారు. విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి తల్లి మణిమంజరి ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 9, 10 వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు.

– నెల్లూరు ఫొటోగ్రాఫర్/ఆత్మకూరు/నెల్లూరు సిటీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి



బొట్టు పెట్టి హిమబిందును ఆశీర్వదిస్తున్న మహిళ



కరపత్రం అందజేస్తున్న సునందారెడ్డి, మణిమంజరి